
సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



ఆస్తి కోసమే డాడీ హోం రాజారెడ్డి హత్య!

డాడీ హోం నిర్వాహకులు రాజారెడ్డిని ఆస్తి కోసమే హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. - IIలో



మదనపల్లె.. సమరయోధుల ఖిల్లా

స్వాతంత్య్ర ఉద్యమంలో మదనపల్లె వాసులు తమదైన ప్రభావం చూపారు. బ్రిటీష్‌వారిని తరిమికొట్టడంలో ప్రభావం చూపారు. - IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.600	రూ.740
రెండోరకం	రూ.400	రూ.580



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 282 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	520	545
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 317.840 కిలోలు

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం



స్వాతంత్య్ర దిన వేడుకలకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్



పరేడ్ గ్రౌండ్‌లో రిహార్సల్స్‌లో భాగంగా హాజరైన పోలీసులు

- ఏర్పాట్లను పూర్తి చేసిన జిల్లా అధికారులు
- పరేడ్‌గ్రౌండ్‌లో జెండాను ఆవిష్కరించనున్న జిల్లా ఇంచార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి
- అలరించనున్న సాంస్కృతిక ప్రదర్శనలు, విభిన్న శకటాలు, స్టాళ్లు

రాయచోటి : అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం స్వాతంత్య్ర వేడుకలకు చక్కగా ముస్తాబైంది. ఈ వేడుకలకు జిల్లా ఇంచార్జ్ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి హాజరై జాతీయ జెండాను ఎగురవేయనున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఇప్పటికే వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రం రాయచోటిలో విద్యుత్ దీపాలను అలరించడంతో కార్యాలయాలన్నీ కొత్త శోభను సంతరించుకున్నాయి.

- జిల్లాలో నుంచి నిర్వహించనున్న వేడుకలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి సాయుధ దళాల నుంచి గౌరవవందనం స్వీకరిస్తారు. ఆ తర్వాత జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి గోవర్ధన్‌రెడ్డి ప్రసంగిస్తారు. ప్రదర్శన కోసం వివిధ శాఖలకు చెందిన శకటాలను కూడా గ్రౌండ్‌లో సిద్ధం చేశారు.
- ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఆహ్వానితులు, పాస్‌లు ఉన్న వారు ఉదయం 8 గంటల వరకే సభా ప్రాంగణంలో కేటాయించిన సీట్లలో ఆశీనులవ్వాలని అధికారులు కోరారు.

ఈ కార్యక్రమం అనంతరం సాయంత్రం 5.30 గంటలకు కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ గిరీషా పీఎస్ ఇచ్చే తేనీటి విందు కార్యక్రమానికి మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు హాజరుకానున్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ వివరాలు

- 8:50కి అన్నమయ్య జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాక, పరేడ్ ద్వారా 'జనరల్ సెల్యూట్' ప్రదర్శన
- 8:58కు ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ఆగమనం
- 9:00కి జాతీయ పతాకావిష్కరణ
- 9:05కు పోలీసుల గౌరవవందనంతో పరేడ్ సందర్శన
- 9:15కు మంత్రి సందేశం
- 9:50కి స్వాతంత్య్ర సమరయోధుల సన్మాన కార్యక్రమం
- 10:00కి శకటాల ప్రదర్శన
- 10:30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, అగ్నిమాపక శాఖ ప్రదర్శన
- 11:10కు ఉత్తమ సేవా సర్టిఫికెట్ల ప్రదానం
- 12:05 గంటలకు జాతీయ గీతంతోకార్యక్రమం ముగింపు

శకటాల ప్రదర్శన

1. వ్యవసాయ శాఖ
2. హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ 3. పశుసంవర్ధక శాఖ
4. హౌసింగ్ డిపార్ట్‌మెంట్
5. సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్
6. పిఆర్ ఇంజనీరింగ్ విభాగం
7. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ విభాగం
8. డ్వామా 9. విద్యాశాఖ
10. రాయచోటి మునిసిపాలిటీ
11. డీఎంహెచ్‌ఓ... 108, 104 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

నవరత్నాలు, ప్రభుత్వ పథకాలపై వివిధ శాఖల శకటాలు, స్టాల్స్ ప్రదర్శన, ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయి. ఈ వేడుకలలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, విద్యార్థులు, పాత్రికేయులు, ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

పరేడ్ రిహార్సల్స్ సక్సెస్



రిహార్సల్స్‌లో భాగంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ గంగాధరరావు

రాయచోటి : స్వాతంత్య్ర దిన వేడుకల పోలీసుల కవాతు రిహార్సల్స్, భద్రత, బందోబస్తు ఏర్పాట్లు విజయవంతం అయ్యాయి. సోమవారం ఎస్పీ ఆర్.గంగాధరరావు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు రిహార్సల్స్ వేడుకలను పరిశీలించారు. మంగళవారం నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లను ఎస్పీ తనిఖీ చేశారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ మహబూబ్‌బాషా పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. రిహార్సల్స్‌లో భాగంగా ముందుగా సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకం ఎగురవేశారు. అలాగే సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శన పరిశీలించి కవాతును నిర్వహించడంలో కొన్ని సూచనలు, మెలకువలను సూచించారు. వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ వివి రాజ్‌కమల్, ఆర్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలి

రాయచోటి : స్పందన కార్యక్రమానికి హాజరవుతున్న ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలని ఎస్పీ గంగాధరరావు ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పందనకు 63 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు. స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి చట్టప్రకారం పరిష్కరించాలన్నారు. ఆయా అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను స్వయంగా ఎస్పీ తెలుసుకుని వాటి పరిష్కారంపై స్పందించారు.

వీరభద్రుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు.

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జాతీయ న్యాయసేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయసేవాధి కారసంస్థ, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలనీ నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్‌ఛార్జ్ ప్రధాన న్యాయమూర్తి జి. గీత, డిఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్‌లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 08562- 258622, 244622 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

16న జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో ఈనెల 16వ తేదీ బుధవారం 5 జిల్లాల జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌జూనియర్ బాలబాలికల విభాగంలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 99120 20424 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్ : జాతీయ ఆరోగ్య పథకం కింద అర్హులైన అభ్యర్థులు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. యూపీహెచ్‌సీ, ఎన్‌బీఎస్‌యూ, ఎస్‌ఎన్‌సీయూ, డీఈఐసీ ప్రోగ్రాంల కింద పనిచేసేందుకు అభ్యర్థులు ఖాళీలు, దరఖాస్తు నమూనా, నెలసరి వేతనం తదితర వివరాలను కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో చూడవచ్చన్నారు. దరఖాస్తులను ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని డ్రాప్ బాక్స్‌లో అందజేయాలన్నారు. నిర్దేశిత గడువు తరువాత, పోస్ట్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోబోమని తెలిపారు.

సీఎం శౌర్య పతకానికి ఎంపిక



కానిస్టేబుల్ సిద్ధయ్య

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండలం పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన సిరివెల్ల సిద్దయ్య అనే కానిస్టేబుల్ సీఎం శౌర్య పతకానికి ఎంపికయ్యారు. మంగళవారం విజయవాడలో జరిగే స్వాతంత్య్ర వేడుకలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పతకాన్ని అందుకుంటాడు. తుమ్మలపల్లి గ్రామానికి చెందిన సిరివెల్ల పెద్ద బాబయ్య, పీరమ్మల కుమారుడు సిరివెల్ల సిద్ధయ్య 2013లో పోలీస్ డిపార్టుమెంట్‌లో చేరాడు. సిద్ధయ్య పతకానికి ఎంపికై నందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● మువ్వన్నెల కాంతులు



పంద్రాగస్టు నేపథ్యంలో సిద్దవటంలోని మట్లిరాజుల కోట మువ్వన్నెల కాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. కోటను విద్యుత్ కాంతులతో శోభాయమానంగా అలంకరించామని జిల్లా పురాతత్వ సర్వేక్షణాధికారి బాలక్రిష్టారెడ్డి తెలిపారు. ఆగస్ట్ 15వ తేదీన మంగళవారం సిద్దవటం లోని మట్లిరాజుల కోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జిల్లాలోని పురాతన కట్టడమైన సిద్దవటం కోటలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. – సిద్దవటం

ప్రజల్లో నమ్మకం కలిగిద్దాం

స్పందనపై అధికారులతో కలెక్టర్ గిరీషా పీఎస్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ, డీఆర్‌ఓలు

రాయచోటి: ప్రజలలో నమ్మకాన్ని పెంచే విధంగా స్పందన జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారం ఉండాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్,జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, సర్వే అండ్‌ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్‌లు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన జగనన్నకు చెబుదాం అర్జీలపట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి సమస్యకైనా నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు.

స్పందనలో వినతులు

రాజంపేట మండలం, ఆకేపాడు గ్రామ పంచాయతీకి చెందిన డి.నరసింహులు రేషన్ కార్డులో తన పేరు జోడించాలని వినతి పత్రం అందజేశారు. కలకడ మండలం, ఎర్రకోట పల్లికి చెందిన వి వెంకటరమణా రెడ్డి తన కుమారుడు వి ప్రసాద్ రెడ్డి (అవివాహితుడు)ఎస్‌జీటీ టీచర్‌గా పనిచేస్తూ కోవిడ్-19లో చనిపోయారని, కారుణ్య నియామకం కింద తన రెండో కుమారుడు వి బాబుకి అర్హత గల ఉద్యోగం ఇవ్వాలని స్పందనలో కోరారు. వీరబల్లి మండలం , జిటి దళితవాడకు చెందిన వి. శేఖర్ వికలాంగుల కోటా కింద అటెండర్‌గా ఉద్యోగం కోసం విజ్ఞాపన పత్రం అందజేశారు.

నిర్వాసితుల లేఅవుట్‌లో సకల సౌకర్యాలు

మంగంపేట నిర్వాసితులకు లేఅవుట్‌లో అన్ని వసతులు కల్పిస్తామని గ్రామస్తులకు కలెక్టర్ గిరీషా పీఎస్ భరోసా ఇచ్చారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి కలెక్టరేట్‌లో మంగంపేట నిర్వాసితులు కాపుపల్లి, అరుంధతీవాడ, దళితవాడ గ్రామస్తులతో లేఅవుట్‌లలో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ గిరీషా పీఎస్ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా లేఅవుట్‌లో ప్లాట్‌లతోపాటు పచ్చదనంలో భాగంగా పార్కు, దేవాలయాలు, కమ్యునిటీ హాల్, స్కూల్, పోస్టాఫీసు, లైబ్రరీ, అంగన్ వాడీ కేంద్రం, సచివాలయం తదితర వాటికి స్థలం కేటాయింపు చేస్తామని మ్యాపులో గ్రామస్తులకు కలెక్టర్ వివరించారు. లేఅవుట్‌లో ప్లాట్లు అనువుగా రోడ్లు వేస్తామన్నారు. దీంతో పాటు పలు విషయాల గురించి వివరించారు.

ఆకేపాడు సర్పంచ్‌గా మురళీరెడ్డి ఏకగ్రీవం



రాజంపేట టౌన్ : మండలంలోని ఆకేపాడు సర్పంచ్‌గా ఆకేపాటి మురళీరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వైఎస్సార్ సీపీ మద్దతుతో గుండ్లూరు మూడవ వార్డు మెంబర్ స్థానాన్ని ఇండ్లూరు శ్రీలక్ష్మి, ఎంజీపురం ఏడవ వార్డు మెంబర్ స్థానాన్ని మితికాయల గుర్రమ్మ ఏకగ్రీవమయ్యారు. దీంతో వైఎస్సార్ సీపీ స్పష్టమైన ఆధిపత్యాన్ని సాధించినట్లయింది. విజేతలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి టీ.హరిప్రసాద్ సోమవారం ధృవీకరణ పత్రాలను అందచేశారు. ఆకేపాటి మురళీరెడ్డి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆ పంచాయతీ ఆకేపాటి కుటుంబానికి కంచుకోట అని మరోమారు నిరూపితమైంది. ఈసందర్భంగా ఆకేపాటి మురళీరెడ్డి మాట్లాడుతూ అనాదిగా తమ కుటుంబాన్ని ఆదరిస్తున్న ఆకేపాడు ప్రాంత ప్రజలకు తాము ఎప్పటికి రుణపడి ఉంటామని తెలిపారు.

టీడీపీ అభాసుపాలు

ఆకేపాడు పంచాయతీ సర్పంచ్ స్థానానికి టీడీపీ నాయకులు తమ పార్టీ మద్దతుతో గాదెరాజు అమ్మణెమ్మతో నామినేషన్ దాఖలు చేయించారు. అయితే అమ్మణెమ్మతో నామినేషన్ దాఖలు చేయించిన వారు ఆమె నామినేషన్ పత్రంలో అభ్యర్థికి సంబంధించి ఓటరు లిస్టులోని ఓటరు సంఖ్యను పొందు పరచలేదు. అలాగే ప్రతిపాదకుని పేరు రాయకపోవడం , అలాగే ప్రతిపాదకుని ఓటరు లిస్టులో ఉండే వరుస సంఖ్యను కూడా నమోదు చేయపోవడంతో అధికారులు ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. ఆకేపాడు సర్పంచ్ స్థానానికి తమ మద్దతుతో అభ్యర్థిని నిలుపుతున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించబోయి చివరకు నిబంధనల మేరకు నామినేషన్ పత్రాన్ని కూడా నింపక పోవడంతో అభాసుపాలయ్యారు.

శేషాచలంలో చిరుతల సంచారం

- సుమారు 50-60 వరకు ఉంటాయని సమాచారం
- అన్నమయ్య జిల్లా డీఎఫ్‌ఓ వివేక్ వెల్లడి



రాయచోటి : అన్నమయ్య, తిరుపతి, వైఎస్సార్ జిల్లాల మధ్య ఉన్న శేషాచల అటవీ ప్రాంతంలో 50 నుంచి 60 చిరుతల వరకు జీవనం సాగిస్తున్నాయని అన్నమయ్య జిల్లా డీఎఫ్‌ఓ వివేక్ తెలిపారు. తిరుమల నడకదారిలో చిన్నారిని చంపిన చిరుతను అధికారులు పట్టుకున్న తరువాత మరో మూడు చిరుతలు కనిపించిన నేపథ్యంలో సోమవారం డీఎఫ్‌ఓను 'సాక్షి' సంప్రదించింది. శేషాచలం అడవులు దట్టంగా పెరిగి అనేక రకాల అడవి జంతువులకు రక్షణ కేంద్రంగా ఉందన్నారు. అటవీ సమీప ప్రాంతాలలోని ప్రజలు, అడవుల మధ్యన మార్గాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజల సంచారం సాయంత్రం 6 గంటలకు ముగించాలని డీఎఫ్‌ఓ సూచించారు. సాయంత్రం అడవి జంతువులు సంచారం వేట దిశగా వేగంగా కదులుతుంటాయన్నారు. అటవీ సమీప ప్రాంతాల్లోని ప్రజలు సైతం చిన్న పిల్లలను చాలా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. సాయంత్రం వేళల్లో పదేళ్లలోపు పిల్లలను ఇంటి వెనుక భాగాలవైపు వెళ్లనివ్వకుండా చూడాలన్నారు. ప్రధాన మార్గాల్లో రాత్రి వేళల్లో బైకులపై తిరగడం కూడా మంచిది కాదని డీఎఫ్‌ఓ సూచించారు. చిరుతలు వేటలో భాగంగా ఆహారంకోసం సమీప ప్రాంతాలలోకి వచ్చి మాటు వేస్తాయన్నారు.



అన్నమయ్య జిల్లా డీఎఫ్‌ఓ వివేక్

శేషాచలం అటవీ ప్రాంతం మూడు జిల్లాల సరిహద్దులలో విశాలంగా ఉండటంతో జంతువులు తిరిగేందుకు అనువుగా ఉందన్నారు. ఈ అడవిలో పెద్దపులులు సంచారం లేదని, చిరుతల సంచారమే ఎక్కువగా ఉందన్నారు. చిరుతలు, ఎలుగుబండ్లు, చిన్నపిల్లలను ఎత్తుకెళ్లడం ముందు పెద్దలపైన వెనుక నుంచి దాడిచేసి చంపే ప్రయత్నం చేస్తాయన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు అటవీ ప్రాంతాలలోకి ఒంటరిగా వెళ్లవద్దని డీఎఫ్‌ఓ వివేక్ ప్రజలకు తెలియపరిచారు. పల్లె ప్రాంతాలలోకి చిరుత పులులు, ఎలుగుబంట్లు వచ్చినట్లు సమాచారం ఉంటే సమీప అటవీప్రాంత అధికారులకు తెలియపరిస్తే వాటి నుంచి రక్షణ కల్పిస్తామని డీఎఫ్‌ఓ వివరించారు.

అటవీ అధికారుల ఫోన్ నంబర్లు

వివేక్	డీఎఫ్‌ఓ, రాజంపేట	94408 10064
రఘునాథరెడ్డి	కోడూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్	89191 64702
శ్రీలక్ష్మి	రాయచోటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్	94416 54753
పీరయ్య	సానిపాయ్ రేంజర్	89784 81266
బి. కళావతి	సిద్దవటం రేంజర్	88970 35005

ఘనంగా నా భూమి-నాదేశం

సిద్దవటం : ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నా భూమి -నాదేశం కార్యక్రమాన్ని సోమవారం సిద్దవటంలోని ఘన చరిత్ర కలిగిన మట్లిరాజుల కోట వద్ద నిర్వహించారు. ఆశారేఖ పౌండేషన్ చైర్మన్ నెమిలిదిన్నె నాగవేణి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల, శ్రీ సాయి హైస్కూల్, శ్రీ భారతి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై జాతీయ పతాకంతో సిద్దవటం ప్రధాన బస్టాప్ నుంచి కోట వద్దకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ గీతం పాడారు. ఈ సందర్భంగా నాగవేణి మాట్లాడుతూ సిద్దవటం కోట రాజుల గురించి మన జిల్లా వీర చరిత్ర మట్టి కోసం వీరమరణం పొందిన వీరులెందరినో గుర్తు చేసుకొని అవగాహన కల్పించడమే నాభూమి- నాదేశం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యమానికి సిద్దవటం ఎంఈఓ శంకరయ్య, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పురావస్తు శాఖ సిబ్బంది సుబ్రమణంరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్దవటం మట్లిరాజుల కోట వద్ద జాతీయ గీతం ఆలపిస్తున్న విద్యార్థులు

రాయచోటి అభివృద్ధిపై సమీక్ష



అధికారులు, కౌన్సిలర్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : రాయచోటి మున్సిపాలిటీ చరిత్రలోనే రూ.17.5 కోట్ల నిధులతో ఏకకాలంలో అభివృద్ధి పనులు చేస్తుండడం ఒక రికార్డ్ అని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణ అభివృద్ధి పనులపై సోమవారం కౌన్సిలర్లు, అధికారులతో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన శ్రీకాంత్‌రెడ్డి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం సాధారణ నిధులు మొత్తం కలిపి 175 పనులు మంజూరు అయ్యాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో 93 పనులకు రూ.5 కోట్ల నిధులు మంజూరు కాగా 47 పనులు పూర్తయ్యాయన్నారు. 12 పనులు జరుగుతున్నాయన్నారు. జనరల్ ఫండ్‌లో 74 పనులకు రూ.6 కోట్లు మంజూరు కాగా 37 పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 8 పనులు రన్నింగ్‌లో ఉన్నాయన్నారు. 15వ ఆర్థిక సంఘంలో రూ.6.5 కోట్లతో 23 పనులు మంజూరు కాగా 4 పనులను పూర్తి చేయగా మరో 10 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జరుగుతున్న పనుల పూర్తికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక దృష్టి సారిద్దామన్నారు. అత్యవసర పనులను తక్షణమే మొదలుపెట్టేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. డైట్ హాస్టల్‌లో నిర్మితమవుతున్న మున్సిపల్ చిన్నపిల్లల పార్క్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. బిల్లుల చెల్లింపులు త్వరగా చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌కు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మున్సిపాలిటీలో పనుల పురోగతిపై గురుతర బాధ్యత తీసుకోవాలని వార్డు సచివాలయ ఎమినిటీస్‌లకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశరక్షణలో సైనికుల సేవలు ఎనలేనివి

వైవీయూ : దేశరక్షణలో సైనికులు చేస్తున్న త్యాగాలు, సేవలు ఎనలేనివని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం వైవీయూలో 'మేరా మట్టి-మేరా దేశ్'కార్యక్రమంలో భాగంగా వీరజవాన్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతదేశం కర్మభూమి అని, దేశభక్తి ప్రతి పౌరుడిలో ఇమిడి ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి దేశం పట్ల అంకితభావం, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ నేలతల్లికి వందనం.. సైనికులకు అభివందనం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సుబేదార్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ కార్గిల్‌వార్‌లో ఆయన చేపట్టిన బాధ్యతలు, సైన్యం విజయాలు, యుద్ధఘటనల గురించి వివరించారు. అనంతరం వైవీయూ అధికారులు సైనికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి, సూర్యచారిటబుల్ ట్రస్టు చైర్మన్ ప్రభాకర్, డీన్లు, ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లె.. సమరయోధుల ఖిల్లా


పాపన్నగుప్త (ఫైల్)

మదనపల్లె సిటీ : స్వాతంత్య్ర ఉద్యమంలో మదనపల్లె వాసులు తమదైన ప్రభావం చూపారు. బ్రిటీష్ వారిని తరిమికొట్టడంలో ఏకత్వం చాటారు. విదేశీ వనిత డాక్టర్ అనిబిసెంట్ మదనపల్లెలో బీటీ కాలేజీ స్థాపించారు. ఇక్కడే స్వాతంత్య్ర పోరాటాలకు వేదికగా మారింది. అజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా త్యాగధనులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

జాతిపిత బాటలో నూతి రాధాకృష్ణయ్య

మదనపల్లె పట్టణం శాస్త్రి వీధికి చెందిన నూతి రాధాకృష్ణయ్య మదనపల్లె గాంధీగా పేరు పొందారు. గాంధీజీ ప్రారంభించిన ఉప్పు సత్యాగ్రహంలో ప్రధానపాత్ర వహించారు. 1941లో చిత్తూరు బస్టాండు వద్దనున్న మైదానంలో సభ ఏర్పాటు చేశారు. తాను సొంతంగా రాసిన పద్యాలతో గొంతెత్తి ఆలపించారు. బ్రిటీష్ పోలీసులు ఆయన్ను వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు. విదేశీ వస్త్ర బహిష్కరణలో భాగంగా ఖాదీ వస్త్రాలు ధరించాలని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. 1935లో ఖాదీబండార్ నెలకొల్పారు. ప్రజలకు స్వాతంత్య్ర ఉద్యమ ఆవశ్యతను తెలియజేసేందుకు పత్రికలను ప్రచార సాధనాలుగా ఉపయోగించారు. 1999లో అనారోగ్యంతో ఆయన మృతి చెందారు.


మదనపల్లెలోని బీటీ కాలేజీ

విదేశీ వస్త్ర బహిష్కరణలో పాపన్న అలుపెరగని పోరాటం

మదనపల్లె పట్టణం కోర్టు రామాచారి వీధికి చెందిన పాపన్నగుప్త బీటీ కళాశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ అనిబిసెంట్ ఉపన్యాసాలకు ఆకర్షితురాలై పదిహేనేళ్ల బాలంలోనే స్వాతంత్య్ర పోరాటబాట పట్టారు. గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1986లో అనారోగ్యంతో మృతి చెందారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో..

క్విట్ ఇండియా ఉద్యమంలో మాజీ ఎమ్మెల్యే గోపాలకృష్ణయ్య చురుగ్గా పాల్గొన్నారు. గాంధీ పిలుపు మేరకు ఆయన ఉద్యమాల్లో పాల్గొన్నారు.

ఉప్పు సత్యాగ్రహంలో..

చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్‌గా పని చేసిన టి.ఎన్.నాగిరెడ్డి కుమారుడు టి.ఎన్.రామకృష్ణారెడ్డి ఉప్పు సత్యాగ్రహంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన్ను బ్రిటీష్ ప్రభుత్వం ఆరు నెలలు వేలూరు, తిరుచినాపల్లి జైలుల్లో పెట్టారు.

అధ్యాపకురాలి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో ఈ నెల మూడో తేదీన జరిగిన ప్రైవేట్ కళాశాల లెక్చరర్ రుక్సానా హత్య కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుక్సానా హత్య కేసును క్రైమ్ నంబర్ 136/2023 కింద 120(బి), 341, 302, 506, 509.1పీసీ రెడ్‌విత్34 సెక్షన్లు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పట్టణంలోని శివాజీనగర్ చీకలగుట్టకు చెందిన ఎస్.షబ్బీర్‌బాషా అలియాస్ కలిచెర్ల షబ్బీర్‌బాషా, సురభికాలనీకి చెందిన షేక్ ఫారుఖ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో కీలక పాత్ర ధారులైన ముగ్గురు నిందితులు షేక్ ప్యారేజాన్, సులేమాన్, షేక్ అహ్మద్‌లతో పాటుగా భర్త ఖదీర్‌అహ్మద్, మరో ముగ్గురి అరెస్ట్ చూపారు. సోమవారం మరో ఇద్దరిని అరెస్ట్ చేయడంతో ఈ కేసులో ఇప్పటి వరకు 9 మంది అరెస్ట్ అయ్యారు.

ఆర్టీసీ బస్సులు ఢీ..

ఓబులవారిపల్లె : మండలంలోని మంగంపేట జాతీయ రహదారిపై సోమవారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. కడప వైపు వెళ్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సును వెనుక నుంచి నాన్ స్టాప్ ఏసీ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలోని ఎరువుల దుకాణాలపై కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు రెడ్డెప్ప, శేషగిరి ఆధ్వర్యంలో అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. రికార్డులు, అనుమతులు సరిగ్గాలేని రూ. 5,52 లక్షల ఎరువుల విక్రయాలపై నిషేధం విధించారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు ఈ దాడులు కొనసాగాయి. దుకాణాలు, గోడౌన్లలో స్టాకును పరిశీలించారు. ఎరువులు, పురుగుల నివారణ మందుల స్టాకు, విక్రయాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. దుకాణాల్లో విక్రయిస్తున్న ఎరువులు, పురుగుల మందుల నాణ్యత, ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీవిఘ్నేశ్వర, శ్రీకృష్ణా ఎరువుల దుకాణాల్లో రికార్డులు సరిగ్గా లేనట్లు గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. దుకాణాలు, గోడౌన్లలో నిల్వ ఉన్న ఎరువులు విక్రయించిన ఎరువుల వివరాలతోపాటు మరికొన్ని విషయాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయనట్లు గుర్తించామన్నారు. శ్రీవిఘ్నేశ్వర ఎరువుల దుకాణంలో రూ.3,20,850, శ్రీకృష్ణా ఎరువుల దుకాణంలో రూ.2,31,400 మొత్తం రూ. 5,52,250 విలువ చేసే ఎరువులని రైతులకు విక్రయించకూడదంటూ నిషేధం విధించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇరువురు దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఎరువులను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న కంపెనీల ఎరువులనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఈ కేవీ కిషోర్, ఏవో నాగరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న బైక్

- యువకుడి మృతి
- మరొకరి పరిస్థితి విషమం


మృతి చెందిన శ్రీరాములు అలియాస్ రెడ్డి

నిమ్మనపల్లె : విద్యార్థులతో వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సును బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు... కేవీ పల్లె మండలం గర్నిమిట్ట పంచాయతీ లక్ష్మిరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు శ్రీరాములు అలియాస్ రెడ్డి(20) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. తన బంధువైన కలికిరి మండలం శెట్టిపల్లెకు చెందిన మల్లేష్(21)తో కలిసి మూడు రోజుల క్రితం నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లెలోని బంధువుల ఇంటికి అల్లనేరేడు పంటను కోసేందుకు వచ్చారు. పనులు ముగించుకుని ఇద్దరూ సోమవారం ఉదయం దివిటివారిపల్లె నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామాలకు బయలుదేరారు. మార్గంమధ్యలో కొండయ్యగారిపల్లె పంచాయతీలోని మదనపల్లె–నిమ్మనపల్లె మార్గంలో నిమ్మనపల్లె వ్యవసాయ శాఖ కార్యాలయం సమీపంలో, ఆటోను ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న ప్రైవేట్‌స్కూల్ బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీరాములుకు మెడ భాగంలో తీవ్ర గాయాలు కాగా, మల్లేష్‌కు కాలు, చెయ్యి విరగడంతో పాటు తలకు తీవ్ర గాయమైంది. బాధితులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీరాములు అలియాస్ రెడ్డి మృతి చెందగా, మల్లేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. శ్రీరాములు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. నిమ్మనపల్లె ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

నిమ్మనపల్లె : రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె గాండ్ల వీధికి చెందిన దంపతులు ముజీర్(60), షాహినా(50) మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ సాగిబండవారిపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చారు. శుభకార్యం ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళుతున్నారు. బాలినాయనపల్లెకు చెందిన కె.రూపేష్(25) ద్విచక్రవాహనంలో వేగంగా వస్తూ.. వెంగంవారిపల్లె సెల్‌టవర్ వద్ద ఎదురుగా వస్తున్న ముజీర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముజీర్ తలకు తీవ్ర గాయం కాగా, అతని భార్య షాహినా, మరో ద్విచక్రవాహనంలోని రూపేష్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముజీర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్రంగా గాయపడ్డ ముజీర్

ఇంటి స్థలం ఆక్రమణపై కేసు

చిట్వేలి : మండల పరిధిలోని తుమ్మకొండలో ఇంటి స్థలం ఆక్రమించారన్న ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. తుమ్మకొండకు చెందిన డేరంగుల రాజమ్మ (65) ఖాళీగా ఉన్న తన ఇంటి స్థలాన్ని.. అదే గ్రామానికి చెందిన ఆవులకుంట జయమ్మ ఆక్రమించి రేకుల షెడ్డు వేస్తున్నట్లు శుక్రవారం చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు గ్రామానికి వెళ్లి పరిశీలించి గ్రామస్తులను విచారణ చేశారు. ఆవులకుంట జయమ్మపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ..

రాజుకుంట గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలియజేశారు. సోమవారం తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. రాజుకుంట వాటర్ ప్లాంట్ దగ్గర ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో వీఆర్‌ఓ, ఆర్ఐలు నాటిన హెచ్చరిక బోర్డును తొలగించడంతో పాటు కాల్చి వేశారన్న ఫిర్యాదు మేరకు ఇద్దలు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

హుండీల దొంగలు అరెస్ట్


పోలీసుల అదుపులో హుండీల దొంగలు

వీరబల్లి (రాయచోటి టౌన్) : ఆలయాలలో హుండీలు పగులగొట్టి అందులోని నగదు, ఇతర ఆభరణాలను దోచుకెళ్లే ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ చంద్రమోహన్ సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలో వరుసగా ఆలయాల్లో చోరీలు జరుగుతుండటంపై నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. వీరిని పథకం ప్రకారం వంగిమళ్ల సమీపంలో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు చెప్పారు. వారు తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలం చింతకుంట గ్రామం చిన్నబయలు, పచ్చరవాండ్లపల్లె గుట్టపై నివాసం ఉండే యానాది కాలనీకి చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు. వీరు ఐదుగురు ఒక గుంపుగా ఏర్పడి పథకం ప్రకారం చోరీలకు పాల్పడతారని పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ.3500 నగదు, ఆరు గ్రాముల బంగారు నగలు, 65 గ్రాముల వెండి, 17 కిలోల రాగి వైరు, ఒక స్కూటర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు ఆలయాలలో హుండీలను పగలకొట్టడంతో పాటు పొలాల వద్ద మోటార్ల వైర్లు, స్టార్టర్ల వైర్లు కూడా దొంగలించినట్లు వివరించారు. సమావేశంలో వీరబల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లె : నాటుసారాను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ముష్టూరు పంచాయతీ దిగువపల్లెకు చెందిన జనార్థన(25) నాటుసారాను తయారు చేసి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో నిఘా ఉంచామన్నారు. సోమవారం సాయంత్రం దిగువపల్లె సమీపంలో నాటుసారాను విక్రయిస్తుండగా, సిబ్బందితో కలిసి దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో యావజ్జీవ శిక్ష

ప్రొద్దుటూరు క్రైం : తొమ్మిదేళ్ల క్రితం ప్రొద్దుటూరులో పిడిబాకుతో గొంతు కోసి వృద్ధురాలిని హత్య చేసిన కేసులో ముద్దాయి పోలు ఆనందకుమార్‌కు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మిట్టమడి వీధికి చెందిన పోలు ఆనంద్‌కుమార్ గాంధీపార్కులోని లైబ్రరీలో అటెండర్‌గా పని చేసేవాడు. అతను 2014 సెప్టెంబర్ 19న రాత్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వసంతపేటలో నివాసం ఉంటున్న జలదుర్గం మీనాక్షమ్మ (65)ను పిడిబాకుతో పొడిచి ఒంటిపై ఉన్న బంగారు చైన్‌తోపాటు బీరువాలోని వెండి వస్తువులను దోచుకెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత వృద్ధురాలు మృతి చెందింది. ఆమె కుమారుడు జలదుర్గం రమేష్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణా కుమార్ పర్యవేక్షణలో సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాంప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ క్రమంలో నేరం రుజువు కావడంతో రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ సోమవారం పోలు ఆనందకుమార్‌కు యావజ్జీవ కారాగారశిక్షతోపాటు రూ.2.50 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

శెట్టిగుంట 13వ వార్డు ఏకగ్రీవం

రైల్వేకోడూరు : మండలంలోని శెట్టిగుంట 13వ వార్డు మెంబర్‌గా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నగిరిపాటి శంకరమ్మ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ రామిరెడ్డి శెట్టిగుంట గ్రామస్తులందరి సమక్షంలో వార్డు మెంబర్‌గా శంకరమ్మను ఏకగ్రీవంగా తీర్మానించారు. గతంలో ఇక్కడ 13వ వార్డు మెంబర్‌గా ఉన్న టీడీపీకి చెందిన కుటాలమ్మ మృతి చెందడంతో.. ఇన్ని రోజులు ఆ పదవి ఖాళీగా ఉంది. ఎట్టకేలకు ధ్వజారెడ్డి గ్రామస్తులందరిని ఏకతాటి పైకి తెచ్చి ఏకగ్రీవ తీర్మానానికి నాంది పలికారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

శెట్టిగుంటలో టీడీపీకి చెందిన 100 కుటుంబాలు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సూచనల మేరకు వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. రాష్ట్రాభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నట్లు వారు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు, సంక్షేమాన్ని చూసి చేరినట్లు చెప్పారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన శంకరమ్మ, వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

విషద్రావణం తాగి..

పెద్దముడియం : మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో మూడు రోజుల క్రితం విషద్రావణం తాగిన ధన్నవాడ చెన్నయ్య(35) అనే వ్యకి మృతి చెందాడు. ఆయన గ్రామానికి చెందిన తన బంధువు దావీదుతో కలిసి గ్రామంలో గతంలో స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకొని అక్కడే నివాసముంటున్నాడు. కానీ కొనుగోలు చేసిన స్థలం దావీదు పేరు మీద రిజిస్టరు కావడంతో అతను.. 'నువ్వు నిర్మించుకున్న ఇంటి స్థలం నాది' అని తెలపడతంతో మనస్తాపానికి గురయ్యాడు. తన ఇంటిలో శనివారం విషద్రావణం తాగాడు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆస్తి కోసమే డాడీ హోం రాజారెడ్డి హత్య

- ఇద్దరి సాయంతో పథకం ప్రకారం హత్య చేసిన తమ్ముడు
- పోస్టుమార్టం నివేదికలో తప్పుడు రిపోర్టు ఇచ్చిన ప్రభుత్వ డాక్టర్ అరెస్ట్
- లక్ష్మీప్రసన్నను సీఈఓ బాధ్యతల నుంచి తొలగించడమూ కారణమే
- శ్రీధర్‌రెడ్డి, అతని భార్య లక్ష్మీప్రసన్న, డాక్టర్‌తోపాటు మరో ఇద్దరు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్
- రాజారెడ్డి ఆస్తులన్నీ కలెక్టర్‌కు అటాచ్ చేసినట్లు ఏఎస్పీ వెల్లడి


వివరాలు మీడియాకు వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : డాడీ హోం నిర్వాహకుడు నల్లదిమ్మ రాజారెడ్డిని ఆస్తి కోసమే హత్య చేశారు. సొంత తమ్ముడే పథకం ప్రకారం మరో ఇద్దరి సాయంతో గొంతునులిమి హతమార్చాడు. సీఈఓ బాధ్యతల నుంచి లక్ష్మీప్రసన్నను తొలగించడం, ఆస్తి గొడవలు హత్యకు ప్రధాన కారణంగా పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులోని ఐదుగురు నిందితులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్, జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు సోమవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. రాజుపాళెం మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన డాడీ హోం నిర్వాహకుడు రాజారెడ్డి ఈ నెల 11న రాత్రి పూజా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో పడిపోవడంతో బంధువులు, పాఠశాల సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఆస్పత్రికి వెళ్లి రాజారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ విషయమై అక్కడి వైద్యులతో మాట్లాడగా గుండె పోటుతో మృతి చెంది ఉండొచ్చని ప్రాథమికంగా తెలిపారు. పూజా స్కూల్ పీఈటీ రామాంజని ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో 12న ఉదయం రాజారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. తర్వాత పోస్టుమార్టం చేసిన డాక్టర్ అసిస్టెంట్‌ని విచారణ చేయడంతో పోస్టుమార్టంలో కొన్ని లోపాలున్నట్లు పోలీసు అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప రిమ్స్‌కు చెందిన ప్రొఫెసర్లతో రాజారెడ్డి మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఊపిరాడక రాజారెడ్డి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

10 రోజుల నుంచి హత్యకు కుట్ర

రాజారెడ్డి తమ్ముడి భార్య లక్ష్మీప్రసన్న కొన్నేళ్ల నుంచి డాడీ హోం సీఈఓగా కొనసాగుతున్నారు. అయితే ఇటీవల సీఈఓ పదవి నుంచి ఆమెను రాజారెడ్డి తొలగించారు. ఈ బాధ్యతలను డాడీ హోంలో ఉంటున్న అనాథ యువతికి అప్పగించారు. దీంతో లక్ష్మీప్రసన్న దంపతులు ఈ విషయాన్ని బంధువులు, సన్నిహితులతో చెప్పుకొంటూ బాధ పడ్డారు. వీరి మధ్య ఆస్తి వివాదాలు కూడా కొన్ని రోజుల నుంచి కొనసాగుతున్నాయి. దీంతో పగ పెంచుకున్న శ్రీధర్‌రెడ్డి, భార్య 10 రోజులుగా రాజారెడ్డిని చంపేందుకు కుట్ర పన్నుతూ వచ్చారు. ఈ క్రమంలోనే చౌడూరుకు చెందిన శివ, కాకిరేనిపల్లెకు చెందిన సుభాన్‌లతో కలసి ఈ నెల 11న రాత్రి పూజా స్కూల్ క్యాంపస్‌లోనే రాజారెడ్డిని గొంతు నులిమి హత్య చేశారు.

రోస్టర్‌లో డాక్టర్ డ్యూటీ లేకున్నా..

ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ వీరనాథరెడ్డి జనరల్ సర్జన్‌గా పని చేస్తున్నాడు. ఆయన రాజారెడ్డి ఫ్యామిలీ డాక్టర్. అంతేగాక శ్రీధర్‌రెడ్డితో మంచి సంబంధాలు కలిగి ఉన్నాడు. 11న రాత్రి డాక్టర్ వీరనాథరెడ్డికి డ్యూటీ లేకున్నా జిల్లా ఆస్పత్రిలో ఉన్నాడు. ఆ రోజు రాత్రి రాజారెడ్డి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ఆయన మరణానికి గుండె పోటు కారణమని డాక్టర్ వీరనాథరెడ్డి ప్రాథమికంగా తెలియజేశాడు. అంతేగాక మరుసటి రోజు 12న పోస్టుమార్టం చేసి గుండె పోటు వల్లనే రాజారెడ్డి మృతి చెందినట్లు ఆయన తెలిపాడు. పోలీసులకు అనుమానం రావడంతో తిరిగి నిర్వహించిన రీ పోస్టుమార్టంలో ఊపిరాడక రాజారెడ్డి మృతి చెందినట్లు రిమ్స్ ప్రొఫెసర్లు తెలిపారు. పీఎం రోస్టర్‌లో లేకున్నా రాజారెడ్డికి పోస్టుమార్టం నిర్వహించి గుండెపోటు మూలంగా చనిపోయాడని ప్రచారం చేసిన కారణంగా డాక్టర్ వీరనాథరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం

రాజారెడ్డి హత్య కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ప్రజల్లో ఉన్న కొన్ని అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండవ శనివారం, ఆదివారం కావడంతో పూజా స్కూల్ విద్యార్థులకు సెలవులు ఇచ్చారని తెలిపారు. అలాగే పాఠశాలలో గత 10 రోజుల నుంచి విద్యుత్ సమస్య ఉందన్నారు. పాఠశాల ప్రాంగణంలో తెగి పడిన విద్యుత్ వైర్ల విషయమై ఏఎస్పీ మాట్లాడుతూ.. విద్యుత్ వైర్లను ఉద్దేశపూర్వకంగా కత్తిరించారా లేదా అనే దానిపై రిపోర్టు ఇవ్వాలని ఎలక్ట్రికల్ ఏఈకి లెటర్ పెట్టామని చెప్పారు. విద్యుత్‌శాఖ నివేదిక ఆధారంగా విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పూజా స్కూల్‌లో మొత్తం 51 సీసీ కెమెరాలు ఉండగా వాటిలో 5 పని చేయడం లేదని తెలిపారు. వీటిని నిందితులు ఉద్దేశపూర్వంగా పని చేయకుండా చేశారా లేదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. రాజారెడ్డి ఆస్తులను పరిపాలన నిమిత్తం కలెక్టర్‌కు అటాచ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించనున్నట్లు వివరించారు. తదుపరి విచారణలో ఇతరులు కూడా దోషులుగా తేలితే వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, సీఐ ఇబ్రహీం, ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్ పాల్గొన్నారు.